# 101. (192)

"పరిశుద్ధులలో  ఆయన స్వాస్థ్యము యొక్క మహిమైశ్వర్య మెట్టిదో"
ఎఫెసీ 1:18

పల్లవి: జయమనిపాడు జయమనిపాడు ప్రభుయేసునకే మహాదేవుండు
విశ్వవిధాత రక్షకుడాయనే

1. ఆదియంతము అల్ఫ ఓమేగ ఆయనే ప్రభువు
ఆయనయేగా రానున్నవాడు శక్తిమంతుడు ||జయ||

2. ప్రభుయేసునందు మమ్మును పిలిచి ఏర్పరచుకొనెను
ప్రేమతో మమ్ము పవిత్రపరచి నిర్దోషులుగ తీర్చె ||జయ||

3. యేసులో మమ్ము రక్తముద్వారా విమోచించితివి
యెంతో కృపతో మమ్మును కడిగి మన్నించినావుగా ||జయ||

4. యేసులో మాకు యే శిక్షలేదు భయము బాసెగా
వాసిగ మరణ బలము తొలగించి పాపము బాపెగా ||జయ||

5. క్రీస్తులో మమ్ము నూతన పరచి తండ్రిని తెలిపెను
కరుణించి మమ్ము అంగీకరించె ఎంతో అద్భుతము ||జయ||

6. మా స్వాస్థ్యమునకు సంచకరువుగా ఆత్మముద్రనిచ్చెను
మనో నేత్రములు వెలిగించి మాకు గొప్ప నిరీక్షణ నిచ్చె ||జయ||

7. ప్రభు క్రీస్తులో వాడబారని స్వాస్థ్యముగనైతిమి
పరిశుద్ధులలో మహిమైశ్వర్యంబు యెంతో గొప్పది ||జయ||